ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 30 ఏప్రిల్ 2024

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక జిల్లాలో 156మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలారు. తిరుపతి లోక్ సభ స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది పోటీలో వున్నారు. ఎంపీ స్థానానికి 27మంది నామినేషన్లు వేయగా అందులో ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 24 మందిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోగా 23 మంది పోటీలో వున్నారు. అలాగే తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ఏడు నియోజకవర్గాలకు 200 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో 47 మంది నామినేషన్లు చెల్లుబాటు కాలేదు. మిగిలిన 153లో 20 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో 133మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నుంచీ 46 మంది అభ్యర్థులు పోటీలో వుండగా చంద్రగిరిలో 24 మంది, శ్రీకాళహస్తి, సత్యవేడుల్లో 15 మంది చొప్పున, గూడూరు నుంచీ 14 మంది, వెంకటగిరి నుంచీ పది మంది, సూళ్ళూరుపేట నుంచి తొమ్మిది మంది పోటీలో వున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఎన్నికల బరిలో 156మంది



పార్లమెంటుకు 23మంది... ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది అభ్యర్థులు

తిరుపతిలో అత్యధికంగా 46 మంది... అత్యల్పంగా సూళ్ళూరుపేటలో 9 మంది

సత్యవేడులో రెబెల్ అభ్యర్థి జేడీ రాజశేఖర్‌ను సస్పెండ్ చేసిన టీడీపీ

తిరుపతి అసెంబ్లీకి మూడు ఈవీఎంలు

ఈవీఎంలో గరిష్ఠంగా 17 మంది అభ్యర్థుల పేర్లు, చిహ్నాలు మాత్రమే వుంటాయి. తిరుపతి అసెంబ్లీకి 46 మంది బరిలో వున్నందున వారందరి పేర్లు, గుర్తులు అప్‌లోడ్ చేయడానికి మూడు ఈవీఎంలు అవసరమవుతున్నాయి. అందువల్ల ప్రతి ఓటరూ అభ్యర్థుల పేర్లు,గుర్తులూ పరిశీలించి ఓటు వేయడానికి మూడు ఈవీఎంలను పరిశీలించాల్సి వుంటుంది.అలాగే చంద్రగిరి అసెంబ్లీకి కూడా 24 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నందున రెండు ఈవీఎంలను వినియోగించాల్సి వుంటుంది. తిరుపతి ఎంపీ స్థానానికి కూడా 23 మంది పోటీలో వున్నందున అక్కడా రెండు ఈవీఎంల వినియోగం తప్పనిసరి. దీన్నిబట్టి తిరుపతి సెగ్మెంట్‌లో పార్లమెంటుకు రెండు ఈవీఎంలు, అసెంబ్లీకి మూడు ఈవీఎంలు చొప్పున ప్రతి ఓటరు ఐదు ఈవీఎంలు పరిశీలించి ఓటు వేయాల్సి వుంటుంది. చంద్రగిరి సెగ్మెంట్ చిత్తూరు పార్లమెంటు పరిధిలో వుంది. ఇక్కడ పార్లమెంటుకు 19 మంది అభ్యర్థులు బరిలో వున్నారు. అందువల్ల పార్లమెంటుకు రెండు, అసెంబ్లీకి రెండు చొప్పున నాలుగు ఈవీఎంలను ఓటర్లకు అందుబాటులో వుంచాల్సి వుంది. మిగిలిన అన్ని సెగ్మెంట్లలో పార్లమెంటుకు రెండు, అసెంబ్లీకి ఒకటి చొప్పున మూడు ఈవీఎంలు చొప్పున ఓటర్లకు అందుబాటులో వుంచాల్సి వస్తోంది.

అసెంబ్లీస్థానం	మొత్తం అభ్యర్థులు	తిరస్కరించినవి	విత్‌డ్రా	పోటీలో వున్నది
గూడూరు	21	6	1	14
సూళ్ళూరుపేట	16	2	5	9
వెంకటగిరి	17	7	0	10
చంద్రగిరి	43	17	2	24
తిరుపతి	52	4	2	46
శ్రీకాళహస్తి	27	4	8	15
సత్యవేడు	24	7	2	15
మొత్తం	200	47	20	133
పార్లమెంటు తిరుపతి	27	3	1	23

సత్యవేడులో రెబెల్ కలకలం

సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ నేత జేడీ రాజశేఖర్ ఆ పార్టీ రెబెల్ అభ్యర్థిగా బరిలో నిలవడం కలకలం సృష్టించింది.గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన రాజశేఖర్ గత ఐదేళ్లూ పార్టీనే అంటిపెట్టుకుని వున్నారు. ఇంఛార్జి ఇవ్వకపోయినా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. తాజా ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా చివరలో ఉపసంహరించుకుంటారని పార్టీ శ్రేణులు, నేతలు భావించారు.అయితే సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. ఆయన నామినేషన్ విత్‌డ్రా చేయకుండా బరిలో ని లవడం సత్యవేడులో పార్టీకి ఇబ్బందికరంగా మారింది.స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో వున్న రాజశేఖర్‌కు ఎన్నికల కమిషన్ ఎయిర్ కూలర్ గుర్తు కేటాయించింది.సోమవారం రాత్రి జేడీ రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు టీడీపీ ఓ ప్రకటనలో పేర్కొంది.పార్టీ నియమ నిబంధనలను అతిక్రమించి నందున ఆయన్ను నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆ ప్రకటనలో తెలిపారు.

తిరుపతిలో స్వతంత్ర అభ్యర్థుల సంఖ్యపై అనుమానాలు

తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 46 మంది అభ్యర్థులు బరిలో వుండగా ప్రధాన రాజకీయ పక్షాలైన జనసేన, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే. జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఇక్కడే ఎందుకు ఇంతమంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో వున్నారన్న ప్రశ్న పలువురిలో తలెత్తుతోంది.అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో తమకు అనుకూలతలను, వెసులుబాట్లను సృష్టించుకోవడానికి పలువురితో ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వాహనాల వినియోగానికి, జనరల్ ఏజంట్లుగా, పోలింగ్ ఏజంట్లుగా, ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ ఏజంట్లుగా తమ అనుయాయులను ఎక్కువమందిని అందుబాటులో వుండేలా ఈ జాగ్రత్తలు తీసుకున్నారనే అభిప్రాయం కూటమి పార్టీల నేతలు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎక్కువ సంఖ్యలో వారికి అనుకూలమైన ఏజంట్లు కూర్చునే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

శ్రీకాళహస్తిలో ఇండిపెండెంట్‌కు గ్లాస్ టంబ్లర్ గుర్తు కేటాయింపు

శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో వున్న తీగల భాస్కర్‌కు ఎన్నికల అధికారులు గ్లాస్ టంబ్లర్ గుర్తు కేటాయించారు. దీంతో ఎన్డీయే కూటమి శిబిరంలో ఆందోళన నెలకొంది. నియోజకవర్గంలో జనసేన పార్టీ ఇటీవల కొంతమేరకు పుంజుకుంది. ఆ పార్టీ ఎన్నికల చిహ్నమైన గాజు గ్లాసును పోలిన గ్లాస్ టంబ్లర్‌ను ఇండిపెండెంట్‌కు కేటాయించడంతో జనసేన ఓట్లు కొంత మేరకు చీలే ప్రమాదముందని కూటమి పార్టీల నేతలు అనుమానిస్తున్నారు.

ఊపందుకోనున్న ప్రచారం

నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది. ఇప్పటి వరకూ నామినేషన్లు దాఖలు చేయడం, వాటి పరిశీలనలో పాల్గొనడం, ఉపసంహరణల గడువు దాకా పరిణామాల కోసం నిరీక్షించడం వంటి వాటితో పూర్తిస్థాయిలో ప్రచారంలో పాల్గొనే అవకాశం ప్రధాన పార్టీల అభ్యర్థులకు లేకుండాపోయింది. ఇపుడు బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో పాటు గుర్తింపు లేని రాజకీయ పార్టీల అభ్యర్థులకు, స్వతంత్రులకు గుర్తులు కూడా కేటాయించేశారు. అందువల్ల బరిలోని అభ్యర్థులపై స్పష్టత రావడంతో మంగళవారం నుంచీ పూర్తిస్థాయిలో ప్రచారం హోరెత్తనుంది. రోడ్ షోలు, వీధుల్లో వెళుతూ కనిపించిన వారికి నమస్కారాలు పెడుతూ సాగిన అభ్యర్థులు ఇపుడు వీలైనంతవరకూ ఇంటింటి ప్రచారం చేపట్టనున్నారు. ప్రస్తుతానికి ద్వితీయ శ్రేణి, స్థానిక నేతలు, కార్యకర్తలు మాత్రమే ఇంటింటి ప్రచారంలో వున్నారు. అభ్యర్థులు మొత్తం నియోజకవర్గం కవర్ చేసే పరిస్థితి లేనందున ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పోలింగ్ గడువు సమీపించేయడంతో క్షేత్రస్థాయిలో పట్టు బిగించేందుకు, తెర వెనుక మంతనాలకు, పంపకాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశముంది. మొత్తానికి ప్రచారం నేటి నుంచీ పూర్తిస్థాయిలో హోరెత్తనుంది.

పోస్టల్ బ్యాలెట్‌కు 22,416 దరఖాస్తులు

హోమ్ ఓటింగ్‌కు 1,139

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29 : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు 22,416 దరఖాస్తులందాయి.జిల్లావ్యాప్తంగా 15,936మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో వుండగా హోం ఓటింగ్‌కు అర్హులైన వారు కూడా ఫారం 12, 12డి దరఖాస్తులను జిల్లా అధికారులకు అందజేశారు. సోమవారం నాటికి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ కోసం 22,416 మంది దరఖాస్తు చేశారు. పోలింగ్ కేంద్రానికి రాలేని 85ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, 45శాతం పైబడి వికలత్వం ఉన్న దివ్యాంగులు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 5, 6 తేదీల్లో ఇంటి వద్దనే వీరు ఓటు హక్కు వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటుహక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు.ప్రత్యేక పోలింగ్ కేంద్రానికి వెళితే అక్కడ పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం, ఓటు హక్కును వినియోగించుకుని బ్యాలెట్‌బాక్సులో వేయడం అంతా ఒకేసారి జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి తిరుపతి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 5,351మంది ఉద్యోగులకు తిరుపతి బాలాజీకాలనీలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. విధులు కేటాయించిన సిబ్బందికి మే 2న శిక్షణ ఇస్తామన్నారు.ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించి 22,416మందికి పోస్టల్‌బ్యాలెట్ దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. సర్వీసు ఓటర్లకు సంబంధించి మంగళవారం నుంచి ఈటీబీఎస్ పద్ధతిలో పంపుతున్నామని, వారు సంబంధిత ఆర్వోకు పంపనున్నారని వివరించారు.ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తరువాత 774 కేసులకు సంబంధించి 18 కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, 10కేసులపై చార్జ్‌షీట్ ఫైల్ చేయడం జరిగిందని, మిగిలిన 600కేసులు దర్యాప్తులో ఉన్నాయన్నారు.రూ.1.52కోట్ల నగదు, రూ.51.17కోట్ల విలువ చేసే లిక్కర్ సీజ్ చేశామన్నారు.

ప్రచారాల్లో శాంతిభద్రతల ఉల్లంఘనలు సహించం



మీడియా సమావేశంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

● కలెక్టర్ హెచ్చరిక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29: ఎన్నికల ప్రచారాలను అభ్యర్థులు బాధ్యతగా నిర్వహించాలని... శాంతిభద్రతలకు విఘాతం కల్పించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ కేటాయించిన సమయంలో నేనాయకులు ప్రచారాలను నిర్వహించాలని లేనిపక్షంలో వారిపై చర్యలుంటాయన్నారు.జిల్లాలో మే 13న జరగనున్న పోలింగ్‌కు సమర్థవంతమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి మంగళవారం నాటికి ఈవీఎంలు తెప్పిస్తున్నట్లు చెప్పారు.నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక బరిలో మిగిలిన వారికి గుర్తులు కూడా కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్



నిడిగల్లు అడవుల్లో ఖాళీ కంటైనర్!

బాలాయపల్లి, ఏప్రిల్ 29:బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు అడవుల్లో ఓ కంటైనర్‌ను స్థానికులు గుర్తించారు. సమాచారం అందించడంతో తహసీల్దార్ పుల్లారావు, ఎస్ఐ మహబూబ్ సుభాని సిబ్బందితో అడవిలోకి వెళ్లి కంటైనర్ తాళాలను తొలగించి పరిశీలించారు. కంటైనర్ ఖాళీగా ఉండడాన్ని గమనించారు. అయితే అడవిలో కంటైనర్‌ను ఎందుకు వదిలేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కంటైనర్‌లో మద్యం తీసుకొచ్చి ఇక్కడినుంచి తరలించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.



తిరుమలలో 'కూటమి' ప్రచారాన్ని అడ్డుకున్న అధికారులు

పోలీసులతో అభ్యర్థి, నాయకుల వాగ్వాదం

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూటమి నాయకుల ప్రచారాన్ని మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. కూటమి తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలిసి జనసేన నేత కిరణ్‌రాయల్, టీడీపీ నేతలు పనబాక లక్ష్మి, సుగుణమ్మ, నరసింహ యాదవ్, జేబీ శ్రీనివాస్, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం తిరుమలలో సోమవారం ఉదయం ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. జీరోలైన్ నుంచి ఐదోలైన్ వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎన్నికల ప్రవర్తన నియామావళి (ఎంసీసీ) అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డీఎస్పీ శ్రీనివాసాచారి, ఐసీ సత్యనారాయణ, సిబ్బంది కలిసి బాలాజీనగర్‌కు చేరుకున్నారు. వెంటనే ప్రచారాన్ని ఆపేయాలంటూ ఆదేశించారు. ప్రచారాల్లో ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజాగా మరోసారి అనుమతి పొందాకే కొసాగించాలంటూ అడ్డుకున్నారు. ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఇలా ప్రచారాన్ని మధ్యలో అడ్డుకోవడం ఏంటంటూ ఆరణి, కిరణ్‌రాయల్ పోలీసులను ప్రశ్నించారు. రేపటినుంచి తాజా నిబంధనలను పాటిస్తామన్నారు. ఈక్రమంలో అధికారులు, కూటమి నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. చివరకు అధికారులు సర్దిచెప్పడంతో కూటమి నాయకులు ప్రచారాన్ని ఆపేసి వెళ్లిపోయారు.



కూటమి అభ్యర్థి, నాయకుల ప్రచారాన్ని అడ్డుకుంటున్న అధికారులు, పోలీసులు

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీకి రక్షణ కల్పించండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీకి తక్షణం వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఆదేశాలిచ్చారు. తమకు సెక్యూరిటీ కల్పించేలా తిరుపతి జిల్లా ఎస్పీ, పోలీసులను ఆదేశించాలని కోరుతూ పులివర్తి నానీ, ఆయన సతీమణి, కుమారుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు.

చంద్రగిరి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ


టీడీపీ నాయకుల ఇంటింటా ప్రచారం

భాకరాపేట, ఏప్రిల్ 29: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిన్నగొట్టిగల్లు మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ కొట్టే శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు, భాకరాపేటలో సోమవారం ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మోహన్‌రెడ్డి, భావజాన్, షబాబ్ బాషా, కాకి వెంకటరమణ, ఎర్రయ్య నాయుడు, గుర్రప్ప నాయుడు, సుబ్రహ్మణ్యం, గిరిబాబు, చెంగయ్య, సురేంద్ర, నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని పాకాల పంచాయతీ పరిధిలోని కరీంతుల్లాబాద్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కరీంతుల్లాబాద్‌లో ఎన్నికల ప్రచారం

రామచంద్రపురం: మండలంలోని రాయలచెరువుపేట, రామాపురం పంచాయతీల్లో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించాలంటూ ఆ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యేగా ఈసారి నానీ గెలుపు ఖాయమన్నారు. మాధవయ్య, ముద్దుకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రామాపురంలో టీడీపీ నాయకుల ప్రచారం

సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29: ఎన్నికల బరిలో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా సిద్ధమైన నేపథ్యంలో నోడల్ అధికారులు విధులను సమర్థవంతంగా నిబంధనల మేర నిర్వహించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం అయ్యారు. ముందుగా ఈవీఎం సప్లమెంటరీ ర్యాండమైజేషన్ పక్కాగా చేపట్టాలన్నారు. ఓటర్ సమాచారం స్లిప్పులు మే 1 నుంచి 6వ తేదీ వరకు పంపిణీ, వీవీఎం సెకండ్ ర్యాండమైజేషన్ మే 1న ఆర్వోల పరిధిలో జరగాలని, ఈవీఎం కమిషనింగ్ మే 3, 4వ తేదీల్లో నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న పోలీసు అబ్జర్వర్

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 29: తిరుపతి పార్లమెంటు ఎన్నికల పోలీసు విభాగం పరిశీలకులు అరవింద్ సాల్వే సోమవారం నోడల్ అధికారి సురేంద్రరెడ్డి, సీఐలు జయనాయక్, రామచంద్రారెడ్డిలతో కలసి తిరుపతిలోని చిన్నబజారువీధి, గాలివీధి, అనంతవీధి, బలిజవీధి, చింతకాయలవీధి, శివజ్యోతినగర్, ఎర్రమిట్ట, అన్నారావుసర్కిల్, కపిలతీర్థంసర్కిల్, సత్యనారాయణపురం ప్రాంతాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలు జరిగే రోజు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు.

'ఇండియా కూటమి' ప్రచారం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 29: తిరుపతిలో ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పి.మురళి (సీపీఐ)ని ప్రజలు గెలిపించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విజ్ఞప్తి చేశారు. యశోదనగర్‌లో సోమవారం ఇంటింట ప్రచారం చేశారు. అభ్యర్థి పి.మురళి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు-వర్తమాన పరిస్థితులపై సదస్సు

యశోదనగర్‌లోని వేమన భవన్‌లో ఎన్నికలు-వర్తమాన పరిస్థితులపై సోమవారం సాయంత్రం సీపీఎం జిల్లా కమిటీ సదస్సు నిర్వహించింది. ఇందులో సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు, పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రసంగించారు. పదేళ్లుగా కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం దోచిపెట్టిందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వామపక్ష పార్టీలతో కలసి బీజేపీకి గుణపాఠం చెపుతామన్నారు.

రుయాలో పట్టుబడ్డ సెల్‌ఫోన్ల దొంగ


పట్టుబడ్డ దొంగ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29: రుయాస్పత్రిలో సెల్‌ఫోన్ల దొంగను పట్టుకున్నారు. 'రుయాలో ఒకేరాత్రి 11 సెల్‌ఫోన్ల చోరీ' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దీనిపై స్పందించిన సెక్యూరిటీ సిబ్బంది ప్రతి వార్డులో మఫ్టీలో రోగుల మధ్య ఉండేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి కూడా అత్యవసర విభాగంలో న్యూరోసర్జరీ వార్డులోకి ప్రవేశించిన ఓ దొంగ అక్కడ నిద్రిస్తున్న రోగుల సెల్‌ఫోన్ చోరీ చేస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. వెంటనే వెస్ట్ పోలీసులకు సమాచారం అందించి, దొంగను అప్పగించారు. ఇదిలా ఉంటే.. ఇటీవల కాలంలో రుయాలో సెల్‌ఫోన్లు చోరీ చేస్తూ సీసీ కెమెరాలకు చిక్కిన దొంగ ఇతడు కాదని, అతడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం.. ప్రజల పాలిట పెనుభూతం

- టీడీపీ నేత ఊట్ల సురేంద్ర నాయుడు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఊట్ల సురేంద్ర నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం.. ప్రజల పాలిట పెనుభూతం అని టీడీపీ నేత ఊట్ల సురేంద్ర నాయుడు విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు ఆస్తులకు వైసీపీ ప్రభుత్వం ముప్పు తెచ్చేలా వ్యవహరిస్తోందన్నారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో బాధితులు ఉండిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించలేని వైసీపీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఇంటికి పంపాలని కోరారు. రజక సాధికార సమితి నాయకులు శంకర్, వెంకటముని, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి మహిళా వర్సిటీకి వేసవి సెలవులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: పద్మావతి మహిళా యూనివర్సిటీకి మే ఒకటి నుంచి జూన్ 17వ తేదీ వరకు వేసవి సెలవులిస్తూ.. వీసీ భారతి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ రజని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 18వ తేదీన తరగతులు పునః ప్రారంభం కానున్నాయి. అయితే, పరిపాలనా భవనం, హాస్టల్ కార్యాలయం, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, హెల్త్ సెంటర్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పని చేయనున్నాయి.

బీజేపీ అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించాలి

- ఎస్సీ, ఎస్టీ పొలిటికల్ జేఏసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాదరావును అనర్హుడిగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ పొలిటికల్ జేఏసీ నేతలు మురళీకృష్ణ, ప్రదీప్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. న్యాయవాది సుధాకర్ మాదిగ, దుగ్గాని జయరాం, రాజశేఖర్, ప్రభు, సుకుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి వంద లడ్డూ ట్రేల వితరణ


లడ్డూ ట్రేలు అందజేస్తున్న దాతలు

తిరుచానూరు, ఏప్రిల్ 29: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి సుమారు రూ.6లక్షలకు పైగా విలువ చేసే వంద లడ్డూ ట్రేలను మదురైకు చెందిన దాత కేజీ శ్రీనివాసన్ సోమవారం ఆలయ అధికారులకు అందజేశారు. దాతకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు మధు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29: బైరాగిపట్టెడలోని మాతృశ్రీ అనాథ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను సోమవారం టీటీడీ విశ్రాంత ఉద్యోగి దేశాధి రెండవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు ఓ.వి.ఎస్.ప్రసాద్ వితరణ చేశారు. దాత కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపు బ్యాంకు ఖాతాలకు పింఛన్ల జమ

భాకరాపేట, ఏప్రిల్ 29: సామాజిక భద్రతా పింఛన్లు పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు మే 1న జమ చేస్తామని ఎంపీడీవో దేవేంద్రబాబు తెలిపారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేని వారికి, వికలాంగులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామన్నారు. పింఛన్‌దారులు పింఛన్ కోసం సచివాలయాల వద్దకు తిరగరాదని సూచించారు.

టీడీపీలో భారీగా వైసీపీ నేతల చేరికలు

తిరుచానూరు, ఏప్రిల్ 29: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో సోమవారం రఘునాథరిసార్ట్స్‌లోని ఆపార్టీ కార్యాలయంలో వైసీపీ నేతలు భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారు. తిరుచానూరు నుంచి ఉమాపతి, మణి తదితరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కిషోర్‌రెడ్డి, సాల్మన్‌రాజు, వాసు, హరేరామ్, మునిరత్నంరెడ్డి, సాయిరాయల్, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎర్రావారిపాళెం మండలం కూరపర్తివారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ సుధాకర్, వార్డు మెంబర్లు గీత, మణితో పాటు పలువురు పెద్దసంఖ్యలో పార్టీలో చేరారు. తమ అధికారాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి గుప్పెట్లో పెట్టుకోవడంతో పల్లెల్లో అభివృద్ధి పడకేసిందని, దీంతో టీడీపీలో చేరామన్నారు. పులివర్తి నానీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామన్నారు.

టీడీపీ గెలుపు చారిత్రాత్మకం కావాలి

సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి టీడీపీ గెలుపు చారిత్రాత్మకం కావాలని ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం వేమూరు అరుంధతివాడలో కూటమి నేతలతో కలిసి పులివర్తి వినీల్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తన తండ్రి పులివర్తి నానీని అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాల కల్పనకు నానీ కృషి చేస్తారని చెప్పారు. పదవులను అడ్డం పెట్టుకుని సంపాదించేందుకు రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే నానీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు. 25ఏళ్ల తరువాత చంద్రగిరిలో టీడీపీ విజయం ఖాయమన్నారు. వైసీపీ నుంచి వస్తున్న నేతలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

మా తమ్ముడికి ఒక్క అవకాశం ఇవ్వండి

- పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి వినతి

మంగళం, ఏప్రిల్ 29: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పులివర్తి నానికి ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ఆయన సోదరి ధనలక్ష్మి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం ఆమె మంగళం పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సహకరించాలని కోరారు. సురేష్ నాయుడు, రవీంద్ర, బాలాజీ, ప్రసాద్, మహేశ్వరి, ఈశ్వరయ్య, జనసేన నాయకులు విజయనిర్మల, కిషోర్‌రాయల్, సాయి తదితరులు పాల్గొన్నారు.


వేమూరులో పులివర్తి వినీల్ కరపత్రాల పంపిణీ, మంగళంలో ప్రచారం చేస్తున్న ధనలక్ష్మి తదితరులు

కీలక పోలీస్ స్టేషన్ల వద్ద భద్రతను పటిష్ఠం చేయండి

- ఎన్నికల పరిశీలకులు


ఆర్వో, ఇతర అధికారులతో సమావేశమైన ఎన్నికల పరిశీలకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 29: కీలకమైన పోలింగ్ కేంద్రాలవద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ కైలాష్ వాకండే, పోలీసు పరిశీలకుడు అమృత్‌రాజ్ అధికారులను ఆదేశించారు. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం, తిరుపతిలోని ఆర్డీవో కార్యాలయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు సోమవారం రాత్రి సందర్శించారు. నియోజకవర్గంలో చేపట్టిన సన్నాహక కార్యక్రమాలను ఆర్వో నిషాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దీనికి ముందు వారు కొన్ని పోలింగ్ స్టేషన్లను కూడా పరిశీలించి, అధికారులకు సూచనలిచ్చారు.

వెంకటగిరి ఎన్నికల సమన్వయకర్తగా ఊకా విజయ కుమార్

తిరుపతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎన్నికల సమన్వయకర్తగా తిరుపతికి చెందిన ఆ పార్టీ సీనియర్ నేత ఊకా విజయ కుమార్ నియమితులయ్యా రు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం 13 నియోజకవర్గాలకు ఎన్నికల సమన్వయ కర్తలను నియమించారు. ఇందులో వెంకటగిరికి ఊకా నియమితులయ్యారు. ఎన్నికల నిర్వహణ కోసం అందరినీ సమన్వయం చేసుకుని, టీడీపీ విజయం కోసం కృషి చేస్తానని విజయ్ చెప్పారు.

అంతర్జాతీయ నృత్యదినోత్సవం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 29: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహించారు. జతీష్ నృత్యాలయ నిర్వాహకులు, నృత్య కళాకారిణి శైలజారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, కళాకారులు కేఎన్ రాజు, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం


ఇలియాస్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29: ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ షేక్ ఇలియాస్ కుటుంబ సభ్యులకు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ రూ.1.90 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. ఇందులో అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష, విడో ఫండ్ కింద మరో రూ.50,000 అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురు హోంగార్డులు ఎం.దిలీప్‌కుమార్, నేతాజా, పావని, అనిల్‌కుమార్‌లకు ఒక్కొక్కరికి రూ.10,000 వంతున రూ.40,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఇలియాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ దాడులు కనపడటం లేదా?

- నిందితులపై తక్షణం కేసులు నమోదు చేయాలి
- ఎస్పీకి ఎన్డీయే కూటమి తిరుపతి అభ్యర్థి విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29: 'తిరుపతిలో వారం రోజులుగా ఎన్డీయే కూటమి నేతలపై జరుగుతున్న దాడులు కనపడటం లేదా? తక్షణం నిందితులపై కేసులు నమోదు చేయండి' అని ఎన్డీయే కూటమి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కూటమి నేతలతో కలిసి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌కి వినతిపత్రం అందజేశారు. ఆరణి మాట్లాడుతూ వైసీపీ అల్లరి మూకలు కొద్ది రోజులుగా వార్డుల్లో తాము చేస్తున్న ప్రచారాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారని చెప్పారు. దొడ్డాపురంవీధి, గిరిపురం, అనంతవీధి, సరోజినీదేవి రోడ్డు, జబ్బార్ లేఅవుట్ ప్రాంతాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిలు పులివెందుల నుంచి రౌడీలను రప్పించి ప్రశాంతంగా ఉన్న తిరుపతిలో దాడులు, రాళ్ల వర్షం, ప్రచారాలు అడ్డుకుని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దాదాపు ఐదారు ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై ఫొటోలు, వీడియోల ఆధారంగా దాడి చేసిన వైసీపీ కార్యకర్తలు, గూండాలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. తాము తిరుపతిలో ప్రశాంతత, ప్రజల భద్రత కోసం యుద్ధం చేయాల్సి వస్తే మాత్రం 99 సార్లు శాంతియుతంగా చేస్తామని, అనవసరంగా రెచ్చగొట్టి ఎన్నికల ప్రచారాలను అడ్డుకుంటే మాత్రం ఇక చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేసి ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఎస్పీని కలసిన వారిలో టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహయాదవ్, చినబాబు, దంపూరు భాస్కర్‌యాదవ్, ఊకా విజయకుమార్, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎన్డీయే కూటమి నాయకులు

కల్కి భూములను రైతులకు అప్పగించాలి

హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్


మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: కల్కి భూములను తక్షణం రైతులకు అప్పగించాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదయ్యపాళెం మండలం చెదులుపాకం గ్రామంలోని వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, బేబమ్మలకు చెందిన సీలింగు భూమి మూడెకరాల 74 సెంట్ల భూమిని 16 ఏళ్ల క్రితం కల్కి ఆక్రమించారని ఆరోపించారు. భూముల్లోకి రైతులను అనుమతించకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. ఆక్రమించిన భూమిలో బిల్డింగులు కట్టామని, అందువల్ల ఆ భూమి తనకే అప్పగించాలని ఈ ఏడాది జనవరి పదో తేదీన కల్కి వేసిన పిటిషన్‌ని కోర్టు వేసిందని చెప్పారు. అయినా రైతులకు భూమిని అప్పగించడంలో అధికారులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో వివరణ ఇవ్వాలని కోరారు. అలాగే, ఏడాదికి రూ.4లక్షల చొప్పున రైతులకు కల్కి నుంచి పంట నష్ట పరిహారం ఇప్పించాలని సూచించారు. లేకుంటే దీనిపై తాము న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేస్తున్న దొంగ బాబాలను అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏఆర్ రెడ్డి, రైతులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అరవింద కంటి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సీఈవో తనిఖీలు


రోగులతో మాట్లాడుతున్న లక్ష్మీశ

తిరుపతి (వైద్యం), ఏప్రిల్ 29: జూపార్కు రోడ్డులోని అరవింద కం టి ఆస్పత్రిని సోమవార ం ఆరోగ్యశ్రీ సీఈవో లక్ష్మీశ తనిఖీలు చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీలో రోజుకి 50 నుంచి 60 మందికి శస్త్ర చికిత్సలు అందిస్తున్నట్టు సీఎంవో డాక్టర్ అశోక్ వర్ధన్ తెలియజేశారు. రోగులకు వైద్యంతోపాటు మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత కూడా ఆస్పత్రి యాజమాన్యానిదేనని సీఈవో సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌లను పరిశీలించి, ఆరోగ్యమిత్రలకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త రాజశేఖర్‌రెడ్డి, మేనేజరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

2,959 కిలోల ఎర్రచందనం స్వాధీనం

- ఓ స్మగ్లర్ అరెస్టు
- మినీలారీ, రెండు ద్విచక్ర వాహనాల సీజ్

మంగళం, ఏప్రిల్ 29: కడప ఫారెస్టు డివిజన్‌లోని పోరుమామిళ్ల అటవీప్రాంతంలో 2,959 కిలోల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. సంఘటనా స్థలం నుంచి ఓ మినీలారీ, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. తిరుపతి కపిలతీర్థం వద్ద ఉన్న టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో సోమవారం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మీడియాకు వివరాలు తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐలు మురళీధర్‌రెడ్డి, నరేష్ బృందం కడప జిల్లా పోరుమామిళ్ల రేంజ్ మల్లేపల్లి సెక్షన్‌నుంచి చందనాలబోరు వరకు ఆదివారం కూంబింగ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఓ మినీలారీలో 2,959 కిలోల బరువున్న 101 ఎర్రచందనం దుంగలను తరలించడానికి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. సిబ్బంది అక్కడికి చేరుకోగానే కొందరు స్మగ్లర్లు పరారవగా, కడప జిల్లా ముదిరెడ్డిపల్లెకు చెందిన కొమరోలు అంకయ్య(39) అనే స్మగ్లర్‌ని పట్టుకున్నారు. దుంగలుసహా లారీని, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలు, వాహనాల విలువ రూ.కోటి ఉంటుందని ఎస్పీ తెలిపారు. సిబ్బందిని రివార్డులతో సత్కరించారు. సమావేశంలో డీఎస్పీ చెంచుబాబు, ఏఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు చిరంజీవి, సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఆర్ఎస్ఐలు మురళీధర్‌రెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు. కాగా, ఎర్రచందనం దుంగలతోఉన్న మినీలారీని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. వాహనం మరమ్మతులకు గురవడంతో బాగుచేశాక పోరుమామిళ్ల వద్ద నుంచి తిరుపతికి తీసుకురానున్నట్లు సమాచారం.


పట్టుబడ్డ స్మగ్లర్, వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

వీధుల్లో చిన్న, చిన్న ప్రచారాలకు మాత్రమే అనుమతి ఇచ్చాం

- డీఎస్పీ సురేంద్రరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29: 'తిరుపతి నగరంలో రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో సోమవారం పెద్ద, పెద్ద ప్రచారాలకు అనుమతి రద్దు చేశాం. వీధుల్లో కార్యకర్తలు, కూలీలు మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా చిన్న, చిన్న ప్రచారాలు మాత్రమే చేసుకోవడానికి అనుమతి ఇచ్చాం' అని డీఎస్పీ సురేంద్రరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం, సాయంత్రం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వైసీపీ జెండాలు పట్టుకుని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని వివరణ కోరగా ఆయన పై విధంగా స్పందించారు. వారం రోజులుగా ఎన్నికల ప్రచారంలో జరిగిన విధ్వంసాలు, ఘర్షణలు, కొట్లాటలకు సంబంధించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ ప్రత్యేకంగా ఆర్వోకు లేఖ రాశారన్నారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి, అన్ని పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో నిబంధనలు పాటించి, రూట్ మ్యాప్ ఆధారంగా రిటర్నింగ్ అధికారి ఇచ్చిన అనుమతుల మేరకు ప్రచారాలు చేసుకోవాలని చెప్పారన్నారు. అందువల్ల ప్రతి రోజూ వివిధ పార్టీల అభ్యర్థులు ఏ వార్డులో ప్రచారం చేస్తారు.. ఎంతమంది పాల్గొంటారు.. అనే వివరాలను అందజేయాలన్నారు. అందుకు తగిన విధంగానే ప్రచారాలు చేసుకోవాలని, ఆర్వో అనుమతి లేకుండా అభ్యర్థులు ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

380 కేసులు.. రూ.19.36 లక్షల జరిమానా

ఐదుగురికి జైలుశిక్ష : డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29: తిరుపతిలో నాలుగు నెలల వ్యవధిలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్, ఓవర్ స్పీడుగా వెళ్లడం, రోడ్లపై తోపుడు బండ్లు పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి వాటిపై భారీ ఎత్తున కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 29 వరకు గత నాలుగు నెలల వ్యవధిలో 380 కేసులు నమోదు చేశారు. వారి నుంచి దాదాపు రూ.19.36 లక్షల జరిమానా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. సోమవారం ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుల్లో ఐదుగురికి జైలు శిక్షను న్యాయమూర్తి విధించారని తెలిపారు. రోడ్లపై తోపుడు బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 398 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి రూ.79,600 వసూలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చిత్తూరు వైసీపీ అభ్యర్థి ఎర్రచందనం స్మగ్లర్

- అనేక పోలీస్‌స్టేషన్లలో అతనిపై కేసులున్నాయి
- జిల్లాలో విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి లభ్యం
- అభివృద్ధి పథంలో నడిపించేది టీడీపీయే
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బాలకృష్ణ

చిత్తూరు సిటీ, బంగారుపాళ్యం, ఏప్రిల్ 29: ఎర్రచందనం స్మగ్లర్, మద్యం అక్రమ రవాణా, ఇసుక మాఫియా, భూకబ్జా చేసేవాడికి వైసీపీ చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, అతనిపై అనేక పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని విజయానందరెడ్డిని ఉద్దేశించి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా సోమవారం బంగారుపాళ్యం, చిత్తూరులో బాలకృష్ణ బహిరంగ సభలు నిర్వహించారు. ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'టీడీపీ హయాంలో జిల్లాకు పెద్దయెత్తున పరిశ్రమల్ని తెచ్చి యువతకు ఉపాధి కల్పించాం. విజయా డెయిరీని పునరుద్ధరిస్తామని అమూల్‌కు కట్టబెట్టేసి కమీషన్లు తీసుకుంటున్నారు. చక్కెర ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారు. వైసీపీ వచ్చినప్పటి నుంచి చిత్తూరు జిల్లాలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా లభిస్తున్నాయి. యువత భవిష్యత్తును వైసీపీ నాశనం చేస్తోంది. జిల్లాలో టీడీపీ హయాంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. వైసీపీ హయాంలో శిలాఫలకాలకే పరిమితమైంది.' అన్నారు.

- **తమ్ముడు గురజాలను, అనుభవజ్ఞుడు ప్రసాద్‌రావును గెలిపించండి**

'చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గురజాల జగన్మోహన్ యువకుడు, ఉత్సాహవంతుడు, అందరికీ అందుబాటులో ఉంటాడు. తమ్ముడు గురజాలను కచ్చితంగా గెలిపించండి. ఐఆర్ఎస్ అధికారి అయిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకుఅన్ని రంగాల మీద అపార అనుభవం, పట్టు ఉంది. కేంద్రంతో సఖ్యతతో ఉండి అభివృద్ధి చేయగలరు. అనుభవజ్ఞుడ్ని గెలిపించి పార్లమెంటుకు పంపించండి' అని చిత్తూరులో జరిగిన బహిరంగ సభలో బాలకృష్ణ కోరారు.

- **మురళీమోహన్‌ను అసెంబ్లీకి పంపండి**

'పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌ను కచ్చితంగా గెలిపించి అసెంబ్లీకి పంపించండి' అంటూ బంగారుపాళ్యంలో జరిగిన బహిరంగ సభలో బాలకృష్ణ కోరారు. బంగారుపాళ్యంలో జరిగిన సభను చూసేందుకు పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి, ఐరాల మండలాల నుంచి పెద్దయెత్తున ప్రజలు తరలివచ్చారు. బంగారుపాళ్యం నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ గజమాలతో స్వాగతం పలికారు.

- **ఆకట్టుకున్న ప్రసంగం.. ఎగబడిన జనం..**

చిత్తూరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో సుమారు 45 నిమిషాల పాటు సాగిన బాలయ్య ప్రసంగం ఆకట్టుకుంది. టీడీపీకి బలం కార్యకర్తలేనంటూ, మీ అభిమానాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తోందని వారిని ఉత్సాహపరిచారు. ముస్లింలు అధిక సంఖ్యలో కనిపించేసరికి చిత్తూరులో ఉర్దూ భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు.


చిత్తూరులో సభకు హాజరైన జన సందోహం (ఇన్‌సెట్లో) ర్యాలీగా వస్తున్న బాలకృష్ణ

ఎన్‌ఈపీ ప్రకారమే సిలబస్‌లో మార్పు చేర్పులు

● ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020) ప్రకారం యూనివర్సిటీ పరిధిలో నిర్వహించే కోర్సుల్లో సిలబస్ మార్పు చేర్పులు చేస్తున్నట్టు వీసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ సెనేట్ హాల్లో అకడమిక్ సెనేట్ సమావేశం సోమవారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. 2022-23 వార్షిక నివేదికకు ఆమోదం లభించిందన్నారు. 2024-25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నట్టు చెప్పారు. యూనివర్సిటీలో కొత్త కోర్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఈసీ సభ్యులు సుగుణమ్మ, పద్మనాభం, సుమకిరణ్, సురేంద్రరెడ్డి, నారాయణబాబు, రిజిస్ట్రార్ హుస్సేన్, ఎంఎం నాయుడు, సెనేట్ సభ్యులు, ఫ్యాకల్టీ డీన్లు పాల్గొన్నారు.

సాహిత్య కృషీవలుడు దువ్వూరి రామిరెడ్డి



పురుషోత్తంను సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: తెలుగు సాహిత్య రంగంలో కృషీవలుడుగా కవి దువ్వూరి రామిరెడ్డి నిలిచిపోయారని ఎస్వీ ప్రాచ్య కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కొణిదల పురుషోత్తం అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో సోమవారం సాహితీ సమితి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కృషి ద్వారానే మనిషి మహోన్నతవుతాడనే విషయాన్ని తన సాహిత్యం ద్వారా దువ్వూరి నిరూపించారని కొనియాడారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వై.సుభాషిణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమితి సలహాదారు డాక్టర్ డి.యువశ్రీ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన భరత్‌శర్మ ప్రవచనం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 29: యువ శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ ప్రవచనం ప్రేక్షకులను అలరించింది. సోమవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో విష్ణుపురాణంలో భాగమైన ధ్రువోపాఖ్యానంపై భరత్ శర్మ ప్రవచించారు. అనంతరం అన్నమాచార్య కళామందిరం ఇన్‌చార్జి కోకిల, రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపకుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావులు భరత్ శర్మను సత్కరించారు.

ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచాలి


తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలపై పటిష్ఠ నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగం అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకులు శంకర్ ప్రసాద్ శర్మ, ఎస్.శ్రీనివాస కన్నా, మీను ఓలా తదితర అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి కొండను, తనయుడు తిరుపతిని

చాప చుట్టేశారు!

● మళ్లీ గెలిస్తే మన ఆస్తులు కూడా మిగలవు

● టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ కుమార్



చిన పేరు ఊకా విజయకుమార్. బలిజ సామాజికవర్గంలో బలమైన ముద్రగల నాయకుడు. ప్రజారాజ్యం స్థాపన సమయంలో క్రియాశీలంగా వ్యవహరించారు. తిరుపతిలో చిరంజీవి విజయం కోసం కృషి చేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరి కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గానూ చేశారు. ప్రస్తుతం తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజయం కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్న ఊకా విజయకుమార్‌తో ఫటాఫట్.. ఇంటర్వ్యూ..

? టికెట్ ఆశించిన మీకు అసంతృప్తిగా లేదా.

! వచ్చినట్టే వచ్చి కొన్ని సమీకరణాల వలన చేయి జారిపోయింది. పొత్తులో భాగంగా తిరుపతి సీటు మిత్రపక్షం జనసేనకు వెళ్లింది. అసంతృప్తులు తాత్కాలికమే. మేం పార్టీ సిద్ధాంతాలకు విధేయులం. చంద్రబాబు దిశానిర్దేశం చేయడం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక విమానంలో తిరుపతికి వచ్చి మాతో మాట్లాడిన తీరు మనస్సుకు హత్తుకుంది. అంతిమంగా అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యం.

? తిరుపతికి తాము చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది అని ప్రత్యర్థులు చెబుతున్నారు.

! తిరుపతి అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో అందరికీ తెలుసు. తిరుపతి, తిరుమలను ఖాళీ చేసిన ఘనత మాత్రం ఆ తండ్రీ కొడుకులదే. టీటీడీ పాలకమండలి చరిత్రలో దేవుడి సొమ్ముతిన్న చైర్మన్‌లు లేరు. ఒక్క కరుణాకర రెడ్డి తప్ప! ఆయనకు దేవుడంటే భయంలేదు కాబట్టి అడ్డగోలుగా దోచుకున్నాడు. తండ్రి కొండను ఖాళీ చేస్తే, డిప్యూటీ మేయర్ హోదాలో కొడుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌ను చాపచుట్టేశాడు. ఏదైనా విపత్తులు జరిగినప్పుడు వినియోగించుకునేందుకు డిపాజిట్‌లో ఉన్న నిధులను కూడా మాయం చేసిన ఘనుడు. ఇక టీడీఆర్ బాండ్లు గురించి, మాస్టర్ ప్లాన్ రోడ్ల వెనుక జరిగిన అవినీతి బాగోతం గురించి రాష్ట్రం మొత్తం అట్టుడికిపోయింది.

? కూటమి అభ్యర్థి ఆరణికి అసంతృప్తుల వల్ల నష్టం కదా.

! అదంతా వైసీపీ ప్రచారం మాత్రమే. అందరూ అంకితభావంతో పనిచేస్తున్నారు. వాతావరణం మారుతోందని వారికి అర్థమైపోయింది. మూడు పార్టీల బలం చూసి వారు గడగడలాడుతున్నారు. గతంలో కరుణాకరరెడ్డి గెలిచింది కూడా, ఇద్దరు బలిజ సామాజిక అభ్యర్థులు ఓట్లు చీల్చుకోవడంతోనే. అదీ బొటాబొటిన బయటపడ్డారు. ఈసారి ఆ పరిస్థితి లేదు.

ఫటాఫట్ !

? తిరుపతి బలిజలు ఎటువైపు ఉన్నారు.

! కూటమికి బాసటగా ఉన్నారు. బతుకుదెరువు మీద దెబ్బకొట్టి ఒకరిద్దరి బలిజలను వారివైపు తిప్పుకుంటున్నారే తప్ప 99శాతం వారి ముఖం కూడా చూడరు. నగర సుందరీకరణ పేరుతో లీలామహల్ సర్కిల్లో ఉన్న శ్రీకృష్ణ దేవరాయల కాంస్య విగ్రహాన్ని తీసేసి ఫైబర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, బలిజల మనోభావాలను దెబ్బతీశారు. రూ.3లక్షలు కూడా విలువ చేయని విగ్రహానికి రూ.18లక్షలు లెక్క రాశారు. బలిజ భవన్ నిర్మాణాన్ని కూడా కక్షకట్టి నిలిపేశారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన భూమన కుటుంబంవైపు తిరుపతి బలిజలు ఎవరూ ఉండరు.

? నగర ప్రజలు ఏమి కోరుకుంటున్నారు

! ఎక్కువ మంది విద్యావంతులున్న నియోజకవర్గం ఇది. విజ్ఞతతో ఆలోచిస్తారు. చెడు జరిగితే చూస్తూ ఊరుకోరు. తిరుపతి ప్రశాంతతను కోరుకుంటారు. భూమన అభినయరెడ్డి గెలిస్తే తిరుపతిలో ప్రజల ఆస్తులు కూడా మిగలవని అందరికీ తెలుసు. విచక్షణతో ఓటువేసి అరాచక శక్తులకు పాఠం చెబుతారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది. ఆదివారం 86,241 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,730 మంది తలనీలాలు సమర్పించారు.

3నుంచి భాష్యకార్ల ఉత్సవం

శ్రీవారి ఆలయంలో మే 3నుంచి 21వ తేదీవరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం సందర్భంగా 19 రోజులపాటు ఉభయం సమర్పణ జరుగుతుంది. రామానుజుల వారు జన్మించిన వైశాఖమాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మే 12న భాష్యకార్ల శాత్తుమొర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవయ్యాక శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని ఓ తిరుచ్చిపై, భాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో ఊరేగిస్తారు. తర్వాత ఆలయంలోని విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భాష్యకార్లవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు చేపడతారు. జీయర్‌స్వాములు, ఏకాంగులు తదితరులు పాల్గొంటారు.

స్థానికులకు దర్శన అవకాశాన్ని పునరుద్ధరిస్తా

కొడుకు గెలుపు కోసం హుండీ ఖాళీ - ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు





తిరుమలలో ఆరణి శ్రీనివాసులుకు స్వాగతం పలుకుతున్న స్థానికులు - ఇంటింటి ప్రచారంలో ఆరణి, సుగుణమ్మ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొడుకును ఎమ్మెల్యే చేయడానికి తిరుపతి అభివృద్ధి పేరుతో టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి.. శ్రీవారి హుండీని ఖాళీ చేసి, నిధులను దారిమళ్లించాడని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. దర్శనాల పేరుతో భక్తులను వైసీపీ నేతలు దోచుకుంటున్నారని విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన భాగ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తిరుమలలోని బాలాజీనగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని కూటమి నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానికులు ఆరణికి అడుగడుగునా హారతులు పట్టి, ఆశీర్వదించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో తిరుమలను అప్రదిష్టపాలు చేశారని అన్నారు. కమీషన్ డబ్బు.. దొంగ ఓట్లతో గెలవాలని తండ్రీకొడుకులు చూస్తున్నారని విమర్శించారు. ఐదేళ్లుగా స్థానికులకు దర్శన భాగ్యం కల్పించడంలో కరుణాకరరెడ్డి విఫలమైయ్యారన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు కాగానే తిరుపతి, తిరుమలవాసులకు ప్రతి మంగళవారం దర్శనాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నేతలు నరసింహ యాదవ్, మందలపు మోహన్ రావు, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, కందాటి సురేష్, చినబాబు, తిరుమల నాయకులు కేశవులు, సింగంశెట్టి సుబ్బరామయ్య, భాస్కర్, రాజు యాదవ్, శివ, షణ్ముగం, రాజు, దేవరాజులు, ఆనంద్, రాజేంద్ర, ప్రసాద్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ





ప్రచారంలో వెలగపల్లి వరప్రసాదరావు - సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో వరప్రసాద రావు దంపతులు

కలువాయి/ తిరుపతి (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 29 : గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలంలో టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సిలికా, ఇసుకను దోపిడీ చేసిందని విమర్శించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నా తనదే తప్పు అన్నట్లుగా వ్యవహరించారని తద్వారా వనరులన్నీ దోపిడీకి గురయ్యాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 యేళ్లల్లో జరగనంత అవినీతి ఐదేళ్లలో జరిగిందని ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని కోరారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీని గెలిపించాలని ఆయన ప్రజలకు విన్నవించారు. గతంలో తాను ఎంపీగా పనిచేసిన రోజుల్లో ఎంతో అభివృద్ధి చేశానని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్నో పెద్ద ఎత్తున నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. ఆయనతోపాటు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

సినీ నటుడు బాలకృష్ణతో భేటీ

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను వరప్రసాదరావు కుటుంబసభ్యులతో కలసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం తిరుపతికి వచ్చిన ఆయన ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉండగా కుటుంబసభ్యులు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమారుడు నవీన్‌గుప్తా, ఇతరులు భేటీ అయ్యారు. తమిళనాడు రిటైర్డ్ డీజీపీ శేఖర్ తదితరులు ఆయన్ను కలుసుకున్నవారిలో ఉన్నారు.

ఎన్డీయే కూటమి ప్రచారం

తిరుపతి అర్బన్: ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం సోమవారం జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేష్‌యాదవ్ ఆధ్వర్యంలో 26వ డివిజన్‌లో ప్రచారం చేశారు. మోహన్‌రాయల్, ఆదిశెట్టి మోహన్, సుధారెడ్డి, వెంకటేష్, కళావతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికల సిత్రాలు



ఎన్నికల ప్రచారంలో భాగంగా యశోదనగర్‌లో సోమవారం ఓ దుకాణంలో సరదాగా టీ తయారు చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి మురళిని చూసి నవ్వులు చిందిస్తున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు, నాయకులు

తిరుమలను ప్రక్షాళన చేస్తాం

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



కిరణ్‌తో ఆప్యాయంగా మాట్లాడుతున్న టీడీపీ తిరుమల సీనియర్ నేత మందలపు మోహన్‌రావు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29: ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, తిరుమలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఓటర్లలో భరోసా నింపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉదయం తిరుమల బాలాజీనగర్‌లోని 4,5,6 వీధుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలకరిస్తూ.. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలనతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించిన స్థానికులకు, వ్యాపారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఎన్ని ఇబ్బందులు పెట్టారో తనకు తెలుసునని, ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అన్ని కేసులు మాఫీ చేయించి, అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. చివరగా కిరణ్‌ను టీడీపీ సీనియర్ నేత మందలపు మోహన్‌రావు ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం రాగానే మంచి పదవి రావాలని ఆ దేవదేవున్ని ప్రార్థిస్తున్నానన్నారు. నేతలు హరి, జీవన్, సిద్ధు, రాజేంద్ర, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటినుంచి ఇంటి వద్దకే పెన్షన్లు: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29: జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్లను ఆధారిత బ్యాంకు ఖాతా ఉన్న వారి ఖాతాల్లో నేరుగా బుధవారం నుంచి జమ చేయనున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం పెన్షన్ల పంపిణీపై ఆయన అధికారులతో సమీక్షించారు. దివ్యాంగులకు, వృద్ధులకు, మంచానికి పరిమితమైన, బ్యాంకు ఖాతా లేనివారికి ఇంటి వద్దకే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా మే ఒకటో తేదీనుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎవరూ సచివాలయానికి పింఛన్ల కోసం రావాల్సిన అవసరం లేదని, ఈ విషయంపై పింఛనుదారులకు సంబంధిత ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్లు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మిగిలినవారి బ్యాంకు ఖాతాలకు పింఛను సొమ్ము జమ చేస్తారన్నారు. అందరూ ఒకేసారి బ్యాంకులకు వెళ్లకుండా ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో వెళ్లి డ్రా చేసుకోవాలని చెప్పారు. బ్యాంకుల వద్ద పెన్షన్ కోసం వచ్చే వారికి షెడ్, తాగు నీరు ఏర్పాటు చేయాలని మేనేజర్లకు ఆదేశాలు ఇవ్వాలని ఎల్డీఎంకు సూచించారు.అధికారులు ప్రభావతి, సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

స్కేటింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 29: శ్రీనివాస క్రీడా సముదాయంలో చిన్నారి భరోసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ప్రేమ్ ఆధ్వర్యంలో సోమవారం స్కేటింగ్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. తొలి రోజున దాదాపు 20మంది పిల్లలు హాజరయ్యారు. రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7.30గంటల వరకు శిక్షణ ఇస్తారు. మే నెలాఖరు వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 99855 33560 నెంబరును సంప్రదించాలని కోరారు.



‘ఎమరాల్డ్స్’లో టెక్నో-24

తిరుపతి(విద్య), ఏప్రిల్ 29: తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో టెక్నో-24 పేరున వినూత్న పోటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు ఎన్.మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్‌వలీ, నరసింహులు, శ్రీనివాసులు, చేతన్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్, డాక్టర్ రమేష్, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్య ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: ఎస్వీయూ దూరవిద్య ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ ఫైనలియర్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

జన కేతనం



బరిలో వీరు



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది సోమవారం సాయంత్రానికి లెక్క తేలింది.తిరుపతి లోక్‌సభ స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది పోటీలో మిగిలారు.అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నుంచీ 46 మంది పోటీలో వుండగా, చంద్రగిరిలో 24 మంది, శ్రీకాళహస్తి, సత్యవేడుల్లో 15 మంది చొప్పున, గూడూరు నుంచీ 14 మంది, వెంకటగిరి నుంచీ పది మంది, సూళ్ళూరుపేట నుంచి తొమ్మిది మంది పోటీలో వున్నారు.సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ నేత జేడీ రాజశేఖర్ ఆ పార్టీ రెబెల్ అభ్యర్థిగా బరిలో నిలవడం పార్టీ వర్గాల్లో కలకలం సృష్టించింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 46 మంది అభ్యర్థులు బరిలో వుండగా ప్రధాన రాజకీయ పక్షాలైన జనసేన, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే. జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఇక్కడే ఎందుకు ఇంతమంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో వున్నారన్న ప్రశ్న పలువురిలో తలెత్తుతోంది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

తిరుపతి (ఎంపీ)





బీజేపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
వి. వరప్రసాదరావు	మద్దిల గురుమూర్తి	చింతా మోహన్	బీఎస్పీ: పెనుమూరు గుర్రప్ప; లిబరేషన్ కాంగ్రెస్: విజయకుమార్; ఎస్పీ: వేలూరు తేజోవతి
			మొత్తం : 23 మంది

తిరుపతి (అసెంబ్లీ)





జనసేన	వైసీపీ	సీపీఐ	ఇతరులు
ఆరణి శ్రీనివాసులు	భూమన అభినయ్	పి.మురళి	బీఎస్పీ: జె.వేణుగోపాలరాజు; ఎస్పీ: శ్రీనివాస్ కుమార్ గొర్ల
			మొత్తం : 46 మంది

శ్రీకాళహస్తి





టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బొజ్జల సుధీర్‌రెడ్డి	బియ్యపు మధు	పోతుగుంట రాజేష్	స్వతంత్రులు : 5; బీఎస్పీ : సురేంద్రబాబు; నేషనలిస్ట్ జనశక్తి: గానుగపెంట రమేష్; ఎస్పీ : గోవిందస్వామి
			మొత్తం : 15 మంది

చంద్రగిరి





టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
పులివర్తి నాని	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి	కె.శ్రీనివాసులు	లిబరేషన్ కాంగ్రెస్ : కె.ఈశ్వరయ్య; జైభారత్ నేషనల్ పార్టీ: తురకా అమరనాథ్
			మొత్తం : 24 మంది


సత్యవేడు





టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కోనేటి ఆదిమూలం	నూకతోటి రాజేష్	బాలగురవం బాబు	స్వతంత్రులు : 9; బీఎస్పీ : సుప్రియ; లిబరేషన్ కాంగ్రెస్ : విజయకుమార్; జైభారత్ నేషనల్ పార్టీ : కిరణ్
			మొత్తం : 15 మంది


నగరి





టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
భానుప్రకాష్	ఆర్కే రోజా	రాకేష్ రెడ్డి	స్వతంత్రులు ముగ్గురు; నవరంగ్ కాంగ్రెస్ : జ్ఞానప్రకాష్‌రెడ్డి
			మొత్తం : 9 మంది

సూళ్లూరుపేట


టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
నెలవల విజయశ్రీ	కిలివేటి సంజీవయ్య	చందనమూడి శివ	స్వతంత్రులు : 3; బీఎస్పీ : తొప్పాని రమణయ్య; లిబరేషన్ కాంగ్రెస్ : కందాటి రజనీకాంత్; ఎస్పీ : బి. శ్రీనివాసులు
			మొత్తం : 9 మంది

వెంకటగిరి






టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కురుగొండ్ల రామకృష్ణ	ఎన్.రాంకుమార్	పి.శ్రీనివాసులు రెడ్డి	స్వతంత్రులు : 2; బీఎస్పీ : జయచంద్ర; జైభారత్ పార్టీ : శ్రీరామరాజు; బీసీవై : సీహెచ్. శివకృష్ణ
			మొత్తం : 10 మంది

గూడూరు





టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
పాశిం సునీల్‌కుమార్	మేరిగ మురళీధర్	యు.రామకృష్ణారావు	స్వతంత్రులు : 6; బీఎస్పీ : అన్నెం మల్లికార్జున్; ఎస్పీ : సునీల్‌రాజు; ఐబీపీ: రమేష్‌బాబు; పిరమిడ్ పార్టీ : పోలమ్మ
			మొత్తం : 14 మంది




● చెప్పాడంటే.. చేయడంతే!

అన్ని హామీల తరహాలోనే జగన్ నిమ్మ రైతులకిచ్చిన మాట కూడా అటకెక్కేసింది. ఐదేళ్ల పాలనలో నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండి పోయారు. కోల్డ్ స్టోరేజిల మాట దేముడెరుగు.. కనీసం గిట్టుబాటు ధర ఊసు కూడా లేకుండా పోయింది. పైగా అప్పటి దాకా ఉన్న పథకాలకు జగన్ జమానాలో తిలోదకాలిచ్చేశారు. ఎరువులు, పురుగుమందులు, నర్సరీల మంజూరు, ఆధునిక యాంత్రీకరణ పనిముట్లు, ఉద్యాన పంటల పెరుగుదలకు రుణసాయం.... ఇలా అన్ని ప్రోత్సాహకాలకూ జగనన్న మంగళం పాడేశారు. దీంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో నిమ్మరైతాంగం వెన్నువిరిచినట్లైంది. వేసవి కాలంలో తప్ప మిగిలిన సీజన్లలో కనీసం కూలి కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతుల బాధలు దారుణంగా ఉన్నాయి.

గూడూరులో అన్ సీజన్‌లో 80 కిలోల నిమ్మకాయల బస్తా రూ.500 కూడా అమ్మడం లేదు. రేపు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం రూ.2000 గిట్టుబాటు ధర కల్పిస్తా... అంతేకాదు.. నిమ్మపంట నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేస్తా...

2018 జనవరి 29న ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సైదాపురం వద్ద నిమ్మరైతులకు జగన్ ఇచ్చిన హామీ ఇది... ప్రస్తుత రేటెలా వున్నా రెండు మూడు నెలల్లో అన్‌సీజన్ ప్రారంభం కాగానే బస్తా ఐదారు వందల రూపాయలకు పడిపోతుందని నిమ్మరైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదేనా జగన్ మాకు చేసిన మేలు అని వారు ప్రశ్నిస్తున్నారు.


నిమ్మమార్కెట్‌లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న నిమ్మబస్తాలు



నిమ్మకు నీరెత్తిపోయావేందన్నా...?

- గిట్టుబాటు ధర గాలికి
- అతీగతీ లేని కోల్డ్‌స్టోరేజీల యూనిట్ల హామీ
- ఐదేళ్లలో రైతు సంక్షేమం ఊసేలేదు

తగునా జగనా...

సుమారు 10వేల హెక్టార్లలో సాగవుతున్న నిమ్మపంటపై వేలాది రైతు కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. పరోక్షంగా వ్యవసాయ కూలీలు, ఆటో యజమానులు, వ్యాపారులు కూడా లబ్ధి పొందుతున్నారు. గూడూరు, జయంపు, పొదలకూరు మార్కెట్ సముదాయాలలో వారంలో ఆరు రోజుల పాటు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. రోజూ సుమారు 200 మెట్రిక్ టన్నులకు పైగా మార్కెట్ల నుంచి దేశం నలుమూలలా ప్రధాన నగరాలకు నిమ్మకాయలు రవాణా అవుతుంటాయి. ఏడాది పొడవునా స్థిరంగా గిట్టుబాటు ధర ఉండటం లేదు. నిల్వ చేద్దామంటే శీతల గిడ్డంగులు లేవు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిమ్మరైతులు ఆక్రోశిస్తున్నారు. ఈ క్రమంలోనే గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్షనేత జగన్ గూడూరు మీదుగా వచ్చారు. ఆయనకు అన్నదాతలు తమ గోడు విన్నవించారు. వెంటనే జగన్ స్పందించి వారి కోరికలన్నీ నెరవేర్చుతానన్నారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీల ప్రస్తావనే చేయలేదు. నిమ్మకు నీరెత్తినట్లుండి పోయారని రైతులు వాపోతున్నారు.

- గూడూరు అర్బన్

చేస్తే చేస్తాడనుకున్నాం



ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన ధర ఇవ్వకుంటే ఎట్టాగయ్యా.. ఎన్నికల ముందేమో మంచి ధర వచ్చేటట్టు చూస్తాడని చేప్తే నమ్మాం. జగన్ ముఖ్యమంత్రయ్యాక నిమ్మకు నీరెత్తి పోతాడనుకోలా.. ఈ జన్మలో జగన్ మాటలు నమ్మం.

- మాగుంట విజిత్‌కుమార్‌రెడ్డి, రైతు, గూడూరు

శీతల గిడ్డంగులకు ప్రయత్నాలేవి



నిమ్మపంటతో వేలాది కుటుంబాలు బతుకుతున్నాయి. ధరలు స్థిరంగా లేకపోవడంతో రైతుతో పాటు అందరూ నష్టపోతున్నాం. శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజీలు), విరివిరిగా ఏర్పాటు చేస్తే అందరం బాగుపడతాం. దురదృష్టవశాత్తూ ఇప్పటి దాకా అలాంటి ప్రయత్నాలేవీ ప్రభుత్వం చేయలేదు.

- దందోలు రఘుప్రసాద్‌రెడ్డి. నిమ్మ వ్యాపారి

ఉత్తరాదిలో డిమాండ్ ఉంటేనే ధరలు



ఉత్తర భారత రాష్ట్రాలలో డిమాండ్‌ను బట్టి ఇక్కడ రేట్లు ఉంటాయి. అక్కడ వర్షాకాలం, వంచు కాలంలో డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి రేట్లు పలకవు. ప్రభుత్వమే చొరవ చూపి ధరలస్థిరీకరణపై ప్రణాళికలు తయారుచేసి అమలు చేయాలి.

- దొడ్డగ భాస్కర్‌రావు, నిమ్మ ఎగుమతిదారుడు

ఇదీ మందు

90 వేల మెజారిటీ గ్యారెంటీ

'అన్నా.. నీ ఓటు నాకే. వణక్కం అక్కా.. నాకే గదా!' అంటూ సత్యవేడు ప్రాంతంలో ఒకాయన ఎడాపెడా తిరిగేస్తున్నాడు. టీయంగడి దగ్గర నిలబడివున్న గుంపులోని ఒక పెద్దాయన అతన్ని పిలిచి, 'ఎవురు సామీ నువ్వు.. యే పార్టీ' అంటూ పలకరించాడు. 'ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశాను.' అంటూ అతను బదులిచ్చాడు. 'ఎండనబడి తిరగతావుండావు. పెద్ద పెద్ద పార్టీలవోళ్లే కొట్టుకులాడతావుంటే నడిమధ్దెన నువ్వు గెలిచేదేనా అబయా.. ఏందుకీ యాసందం పాపం నీకు' అంటూ పెద్దాయన సానుభూతితో మంచి మాటలు చెప్పాడు. 'చూస్తావుండు పెద్దాయనా.. 90 వేల మెజారిటీతో గెలవబోతా వుండా.. గ్యారెంటీ.. రాసుకో కావాలంటే' అని అతను సవాలు కూడా విసిరాడు. ఏందిరా సామీ ఈ మనిషి ధైర్నెం అని అక్కడ ఉన్నోళ్లంతా ఆశ్చర్యపడిపోతా ఉంటే, 'జాతకం చూపించుకున్నా.. 90 వేలు గ్యారెంటీ అని చెప్పినారు. దిగుల్లేదు బొండీ' అని చెప్పి అతను మరొకర్ని ఓటడగడానికి వెళ్లిపోయాడు. తాగుతున్న టీ గుటకేసేది కూడా మరిచిపోయి అక్కడున్నోళ్లు వెళ్లిపోతున్న అతనివైపు జాలిగా చూస్తూ ఉండిపోయారు.

- సత్యవేడు



నోట్ దిస్ పాయింట్

రౌడీలూ.. జాగ్రత్త!

నేరచరిత్రగల వ్యక్తులపై ఎన్నికల సమయంలో ప్రత్యేక నిఘా ఉంటుంది. రౌడీషీట్ ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించబోను అంటూ నేరచరిత్ర ఉన్నవారి దగ్గర ఒక బాండ్ రాయించుకోవడాన్ని బైండోవర్ అంటారు. భారతీయ నేర శిక్షాస్మృతిలోని 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. బాండ్ సమర్పించిన తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఇది రాసిచ్చిన రోజు నుంచి ఆరు నెలల పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. నేరం చేసినా, కేసు నమోదైనా 24 గంటల్లో అరెస్టు చేస్తారు. హామీపత్రంలో పేర్కొన్న నగదు మొత్తాన్ని వసూలు చేస్తారు. పదే, పదే కేసులు నమోదై ఎన్నికల సమయంలో గలాటాలు, ఘర్షణలకు పాల్పడితే ఆస్తులు కూడా జప్తు చేసే అధికారం ఎన్నికల అధికారులకు ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి తిరుపతి జిల్లాలో ఇప్పటివరకూ 753 బైండోవర్ కేసులు నమోదు చేశారు. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద హింసకు పాల్పడిన వారి కదలికలపై ఇప్పటినుంచే నిఘా పెట్టారు.

- తిరుపతి(నేరవిభాగం)

ఓటు అమ్ముకున్న వారు శవంతో సమానం

ఓటు అమ్ముకున్న వారు శవంతో సమానం. సొమ్మున్న సోగ్గాళ్ళ గేమ్‌గా నడుస్తున్న ఈ ఎన్నికల్లో ఓటరు నీతిమంతంగా ఉంటే నేతలూ మారతారంటూ జై భారత్ సంస్థ ప్రచారం చేస్తోంది. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆ సంస్థ జాతీయ నేత లోకనాథ్‌తో పాటు పలువురు ప్రతినిధులు సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)





బరిలో వీరు



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది సోమవారం సాయంత్రానికి లెక్క తేలింది. అసెంబ్లీ, పార్లమెంటు బరిలో 97 మంది ఉన్నారు. జిల్లాలోని చిత్తూరు పార్లమెంటు స్థానానికి 51, ఏడు అసెంబ్లీ స్థానాలకు 224 వెరసి 275 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల పరిశీలన ముగిశాక పార్లమెంటు స్థానానికి 21మంది, అసెంబ్లీ స్థానాలకు 83 మంది కలిపి 104 మంది అభ్యర్థులు మిగిలారు. ఇక, చిత్తూరు పార్లమెంటు స్థానానికి ఇద్దరు, అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 97 మంది మిగిలారు. వీరిలో చిత్తూరు పార్లమెంటుకు 19 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 78 మంది పోటీలో ఉన్నారు. అత్యధికంగా పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 14 మంది, ఆ తర్వాత కుప్పం, చిత్తూరులో 13 మంది, పూతలపట్టులో 12, జీడీనెల్లూరులో 11, పుంగనూరులో 8, అత్యల్పంగా నగరిలో ఏడుగురు పోటీలో ఉన్నారు.

ఆర్కే రోజా.. కే రోజా

నగరి అసెంబ్లీలో వైసీపీ తరపున మంత్రి ఆర్కే రోజా పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా కే రోజా పోటీలో ఉన్నారు.


- చిత్తూరు కలెక్టరేట్

చిత్తూరు (ఎంపీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
దగ్గుమళ్ల ప్రసాదరావు	ఎన్. రెడ్డెప్ప	ఎం. జగపతి	స్వతంత్రులు : 13 బీఎస్పీ : విజయ్ కుమార్ నేషనల్ మహా సభ : జానకి రామారావు సమాజ్‌వాది : అభినవ విష్ణు
			మొత్తం : 19

కుప్పం




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
నారా చంద్రబాబునాయుడు	కేఆర్‌జే.భరత్	ఆవుల గోవిందరాజులు	స్వతంత్రులు : 4 బీఎస్పీ : గణేష్ వీసీకే పార్టీ : గోవిందప్ప జైభారత్ నేషనల్‌పార్టీ : రూప మరో మూడు పార్టీల నుంచి ముగ్గురు
			మొత్తం : 13 మంది

చిత్తూరు (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
జీసీ జగన్మోహన్	ఎంసీ విజయానంద రెడ్డి	జి.టికారాం	స్వతంత్రులు : 6 బీఎస్పీ : బి.గంగులయ్య అఖిల భారతీయజనసంఘ్ : బీకే రమణారెడ్డి ఎస్పీ : వి.సరిత
			మొత్తం : 13 మంది

పూతలపట్టు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
మురళీమోహన్	సునీల్ కుమార్	ఎంఎస్ బాబు	స్వతంత్రులు : 6 బీఎస్పీ : నాగేశ్వర రావు బీసీవైపీ : హరిప్రసాద్ ఎస్పీ : పురుషోత్తం
			మొత్తం : 12 మంది

పలమనేరు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
ఎన్.అమరనాథరెడ్డి	ఎన్.వెంకటేగౌడ	బీ.శివశంకర్	స్వతంత్రులు : 9 బీఎస్పీ : ఆర్.శోభ వీసీకే పార్టీ : సి. వినోద్‌కుమార్
			మొత్తం : 14 మంది

జీడీ నెల్లూరు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
డాక్టరు థామస్	కృపాలక్ష్మి	రమేష్‌బాబు	స్వతంత్రులు : 3 బీఎస్పీ : భాస్కర్ సమాజ్ వాది పార్టీ : గుణశేఖర్
			మొత్తం : 11 మంది

పుంగనూరు



టీడీపీ	వైసీపీ	బీసీవై	కాంగ్రెస్	ఇతరులు
చల్లా రామచంద్రారెడ్డి	పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	బీ.రామచంద్రయాదవ్	మురళీమోహన్‌యాదవ్	స్వతంత్రులు : 2 బీఎస్పీ : సురేష్ ఎస్‌డీపీఐ : అన్వర్‌బాషా
				మొత్తం : 8 మంది

నగరి



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
భానుప్రకాష్	ఆర్కే రోజా	రాకేష్	స్వతంత్రులు ముగ్గురు నవరంగ్ కాంగ్రెస్ జ్ఞానప్రకాష్‌రెడ్డి
			మొత్తం : 7 మంది

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. భర్త వైసీపీ సర్పంచి అయినా తన పనేదో తను చేసుకుని పోతున్నారామె. కానీ, ఆ పార్టీలోని కబ్జాదారులైన నాయకులు ఆమెనలా ఉండనివ్వలేదు. ఊరి సంతకోసం అడుగుతున్న స్థలాన్ని కబ్జా చేశారు. ఒక బాధ్యత కలిగిన పౌరురాలిగా ఆమె ఊరికోసం అధికార పార్టీ నాయకులతో పోరాడారు. మంత్రి పెద్దిరెడ్డితోనే కలబడి నిలబడ్డారు. చివరకు కబ్జాకు గురైన స్థలంలో గొర్రెల సంత సాధించారు. ఆమే నీలావతి. శాంతిపురం మండలం మొరసనపల్లె వైసీపీ సర్పంచి జగదీశ్ భార్య. ప్రస్తుతం వైసీపీ రెబల్‌గా నిలబడి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారామె.

- కుప్పం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును అడ్డుకుంటున్న నీలావతి (ఫైల్ ఫొటో)

ఊరికోసం

మంత్రితోనే కలబడి..!

● వైసీపీ 'రెబల్'గా తేలిన నీలావతి



కబ్జాకు గురైనట్లు చెబుతున్న భూమిలో అప్పట్లో సాగిన నిర్మాణాలు



మొరసనపల్లె పంచాయతీ పరిధిలోని సుమారు 64 సెంట్ల భూమిని టీడీపీ హయాం నుంచీ గొర్రెల సంతకోసం పంచాయతీ నాయకులు అడుగుతున్నారు. ఆ పని జరిగిపోయేదే కానీ, ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చేసింది. ఆ పార్టీలోని బలమైన నాయకుల కన్ను ఈ స్థలంపై పడింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ 64 సెంట్ల డీకేటీ భూమి విలువ రూ.కోట్లలో ఉండడంతో ఆ పార్టీలోనే నాయకుల మధ్య దీనిని సొంతం చేసుకోవడానికి పోటీ నడిచింది. చివరికి వైసీపీ మండల కన్వీనర్ దండపాణి అనుచరుడు ఒకరు ఇదే ప్రాంతంలో కర్ణాటకకు చెందిన సుమారు 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పనిలో పనిగా ఈ డీకేటీ భూమిని కూడా అందులో కలిపేసుకున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దానికి తగ్గట్టుగానే సదరు భూమిలో కట్టడాల నిర్మాణమూ ప్రారంభమైంది. మొరసనపల్లె సర్పంచి జగదీశ్ భార్య నీలావతి ఈ ఆక్రమణను సహించలేకపోయారు. నిజానికి ఆ డీకేటీ భూమిలో ఊరికోసం గొర్రెల సంత ఏర్పాటు చేయించాలని ఆమె కూడా భర్తతో కలిసి ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు. దీంతో నీలావతి నేరుగా ఎమ్మెల్సీ భరత్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఆయన అండతోనే మండల నాయకులు కొందరు డీకేటీ భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ గ్రామస్థులను కలుపుకొని ధర్నాలు, రాస్తారోకోకు దిగారు. ఐదారు నెలల క్రితం మంత్రి పెద్దిరెడ్డి కారునే ఆమె అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. చివరకు నీలావతి పోరాటాన్ని తట్టుకోలేని అధికార పార్టీ నాయకులు కబ్జా చేసిన డీకేటీ స్థలాన్ని వదిలేశారు. ఇప్పుడా స్థలంలో సర్పంచితో కలిసి గొర్రెల సంత ఏర్పాటు చేయించారామె. దీంతో కక్ష పెంచుకున్న అధికార పార్టీలోని నేతలు కొందరు తమ అనుచరుల ద్వారా ఆమెపై నీచమైన వ్యాఖ్యలను పోస్ట్ చేస్తూ ట్రోల్ చేశారు. అయినా వెరవని నీలావతి, చివరకు వైసీపీ రెబల్‌గా మారి, ఈనెల 23న కుప్పం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

ప్రలోభాలకు లొంగకుండా..

ఊరికోసం నిలబడినప్పుడు, తన జనం కోసం కలబడుతున్నప్పుడు, ఏ ప్రలోభాలూ లొంగదీసుకోలేవన్నదానికి నీలావతి నిదర్శనం. ఉపసంహరణల చివరి రోజైన సోమవారంనాడు, అంతకుముందు రాత్రి కూడా ఆమెకు ప్రలోభాల ఎరవేశారు అధికార పార్టీ నాయకులు. నియోజకవర్గ స్థాయి నేతలు కొందరు ఆ పార్టీ అభ్యర్థి తరఫున ఆమెతో మంతనాలు జరిపారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోమని కోరారు. అలా చేస్తే పార్టీ అధికారంలోకి వస్తూనే ఏదో ఒక పదవితోపాటు, లక్షల రూపాయల ఆఫర్ కూడా చేసినట్లు సమాచారం. వీటన్నింటినీ ఆమె తిరస్కరించారు. వైసీపీ జమానాలో ఊరికి, ఊరి ప్రజలకు న్యాయం జరగలేదు కాబట్టేతాను స్వతంత్రించి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడుతున్నానని తెగేసి చెప్పారు. చివరకు ఆమె వైసీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.



జీడీనెల్లూరులో వైసీపీ రెబెల్

● బరిలో నిలిచిన సర్పంచి కరుణశ్రీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 29: గంగాధరనెల్లూరు అసెంబ్లీకి వైసీపీ రెబెల్ అభ్యర్థిగా సర్పంచి కరుణశ్రీ పోటీలో ఉన్నారు. వైసీపీ సానుభూతిపరురాలైన ఆమె.. కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లె సర్పంచిగా రెబెల్‌గా పోటీచేసి ఎన్నికయ్యారు. అప్పట్లో ఆమెను డిప్యూటీ సీఎం నారాయణస్వామి అభినందించారు. పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ వచ్చారు. 'ఆ తర్వాత నన్ను పార్టీ కార్యక్రమాల'కు నారాయణస్వామి దూరం పెడుతూ వచ్చి, ఇబ్బందులకు గురి చేశారు. నా రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్నారు. ఆ తర్వాత పరిణామాలతో పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యా. ప్రజాసేవ చేయాలనే ఉద్దేశ్యంతో రాజకీయాల్లోకి వచ్చిన నేను ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా (స్వతంత్ర) బరిలోకి దిగా' అని కరుణశ్రీ చెప్పారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదన్నారు.

నోట్ దిస్ పాయింట్

1955లో 59,073
2024లో 2,00,822

● చిత్తూరు అసెంబ్లీలో ఓటర్లు ఇలా..

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 1955లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 59,073 మంది ఓటర్లు ఉన్నారు. 69 ఏళ్ల చరిత్రలో 14 సార్లు ఎన్నికలు జరిగాయి. తాజాగా 15వ సారి ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ఈ ఓటర్ల సంఖ్య 2,00,822కి చేరింది. 1972 తర్వాత నుంచి లభ్యమైన ఓటర్ల వివరాల్లో 1999వరకు పురుష ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఆ తర్వాత 2004 నుంచి మహిళా ఓటర్ల ప్రభంజనం మొదలైంది. ప్రస్తుతం 2,00,822 ఓటర్లలో పురుషులు 97,765,మహిళలు 1,03,023, ఇతరులు 34 ఉన్నారు.

- చిత్తూరు కలెక్టరేట్

నాడు పుంగనూరు నియోజకవర్గంలో అగ్రనేతలుగా, పార్టీ.. ప్రభుత్వంలో ప్రధాన పాత్ర పోషించిన పలువురు నేతలు నేడు రాజకీయంగా కనుమరుగయ్యారు.

● పుంగనూరు

నాడు ప్రముఖ నేతలు


నేడు రాజకీయ కనుమరుగు



ఆర్.రెడ్డెప్పరెడ్డి



శ్రీధర్‌రెడ్డి



బగ్గిడి గోపాల్

● తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో 1983లో ఆ పార్టీ అభ్యర్థిగా బగ్గిడి గోపాల్ పోటీచేసి గెలుపొందారు. కొంతకాలానికి ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేసిన నాదెండ్ల భాస్కర్‌రావుకు మద్దతు ఇచ్చారు. దీంతో ఆయన తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు. క్రమేణా రాజకీయంగానూ కనుమరుగయ్యారు.

● 1999లో టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎన్.శ్రీధర్‌రెడ్డి విజయం సాధించారు. తర్వాత ఆయనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాలేదు. బెంగళూరులో వ్యాపారాలు చేసుకుంటున్నాయన మళ్లీ అక్కడికే వెళ్లారు. ఆ తర్వాత పుంగనూరు రాజకీయాలను పట్టించుకోలేదు.

● 2004లో త్రిపుర పోలీస్ ఐజీగా పని చేస్తున్న ఆర్.రెడ్డెప్పరెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈయనది పెద్దపంజాణి మండలం గోనుమాకులపల్లె. ఈయన తండ్రి ఓబుల్‌రెడ్డి పుంగనూరు సమితి మాజీ అధ్యక్షుడు. అప్పట్లో పెద్దపంజాణి మండలం పుంగనూరు నియోజకవర్గంలో ఉండింది. పుంగనూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా, 2004 ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పటి టీడీపీ అభ్యర్థి ఎన్.అమరనాథ్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ ఇన్‌చార్జిగా ఆయన ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కీలకంగా ఉన్నారు. 2009 నియోజకవర్గ పునర్విభజనతో పలమనేరు వెళ్లారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. రెడ్డెప్పరెడ్డి పలమనేరుకు వెళ్లినా నాటి పుంగనూరు క్యాడర్‌లో చాలామంది ఆయనతో టచ్‌లోనే ఉన్నారు. ఆ తర్వాత రాజకీయంగా క్రియాశీలకంగా లేరు.

- పుంగనూరు


ఇదీ మందు



...అయితే ఎంతిస్తావ్..!

ఎన్నికల ప్రచారాలకు రావాలా.. అయితే ఎంతిస్తావ్. ఇదీ ఆయా పార్టీల అభ్యర్థులు, నేతలకు ఎదురవుతున్న ప్రశ్న. ప్రచారాల్లో పాల్గొనే మహిళలు, యువకులకు యమగిరాకీగా మారింది. మూడు పూటల తిండిపెట్టి ఖర్చుకి డబ్బు ఎంతిస్తారని ముందుగా మాట్లాడాకే ప్రచారానికి అడుగు పెడుతున్నారు. ఎన్నికల ప్రచారాలకు హాజరయ్యే ఆయా పార్టీల్లోని వారికోసం ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రిల్లో టిఫిన్ లేదంటే మళ్లీ భోజనం పెట్టాల్సి వస్తోంది. అసలే ఎండాకాలం.. దీంతో మధ్య మధ్యలో నీళ్ల బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్‌లు, కూల్‌డ్రింక్‌లు తప్పనిసరి. ఇంత ఖర్చు చేసి.. ఒక్కో వ్యక్తికి రూ.200 నుంచి 300వరకు నగదు ఇస్తున్నారు. ఏరోజుకారోజు డబ్బు చెల్లించాల్సిందే. లేదంటే మరుసటిరోజు రారు. ఇలా ప్రధాన పార్టీలు వీరిని ప్రచారాల్లో తిప్పేకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

- గంగాధరనెల్లూరు



శ్రీకాళహస్తి బరిలో 15 మంది

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన ఘట్టమైన నామినేషన్ల దాఖలు, తిరస్కరణ, విత్ డ్రాల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానానికి సంబంధించి 27మంది నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో 4 తిరస్కరణకు గురయ్యాయి. 8 మంది విత్ డ్రా చేసుకున్నారు. చివరిగా ఎన్నికల బరిలో 15 మంది నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి రవిశంకర్‌రెడ్డి వెల్లడించారు. వీరికి కేటాయించిన గుర్తులు... బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి(టీడీపీ)- సైకిలు, బియ్యపు మధుసూధన్ రెడ్డి(వైసీపీ)- సీలింగ్ ఫ్యాన్, పోతుగుంట రాజేష్ నాయుడు(భారత జాతీయ కాంగ్రెస్)- హస్తం, కుంట్రపాకు సురేంద్రబాబు(బీఎస్పీ)- ఏనుగు, కుప్పన్నగారి దీనాద్(బీసీవై పార్టీ)- గన్నా కిసాన్‌గానుగపెంట రమేష్(నేషనలిస్ట్ జనశక్తి పార్టీ) - డ్రిల్ మెషీన్, డి.గోవింద స్వామి(ఎస్పీ)- సైకిల్ పంప్, నిరంజన్ రెడ్డి(జై భారత్ నేషనల్ పార్టీ) - బ్యాటరీ టార్చి, పావని అత్తిరాల(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)- టెలివిజన్, పులి పుష్పలత(విడుదలై చిరుతైగల్ కట్చి పార్టీ)- వాటర్ ట్యాంక్, ఎల్లయ్య చుక్కల(స్వతంత్ర)- బకెట్, కె. చిరంజీవి(స్వతంత్ర)- విద్యుత్తు సంభం, పెద్దేసిగారి శ్రీనివాసులు రెడ్డి(స్వతంత్ర)- బ్యాట్, పేరం నాగరాజు నాయుడు(స్వతంత్ర)- గ్యాస్ సిలిండర్, భాస్కర్ తీగల(స్వతంత్ర)- గ్లాస్ టంబ్లర్.

సత్యవేడు బరిలోనూ 15 మంది

సత్యవేడు, ఏప్రిల్ 29: సత్యవేడు అసెంబ్లీ స్థానానికి 15 మంది పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు. మొత్తం 24మంది నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో 7 తిరస్కరణకు గురయ్యాయి. ఇద్దరు ఉపసంహరించుకున్నారు. చివరగా బరిలో వారికి కేటాయించిన గుర్తులు... కోనేటి ఆదిమూలం(టీడీపీ)- సైకిల్, నూకతోటి రాజేష్ (వైసీపీ) - సీలింగ్ ఫ్యాను, బాలగురవం బాబు(కాంగ్రెస్)- హస్తం, సీ.సుప్రియ (బీఎస్పీ) - ఏనుగు, వీ.కిరణ్ (జైభారత్ నేషనల్ పార్టీ) బ్యాటరీ టార్చ్, విజయ్‌కుమార్(లిబరేషన్ కాంగ్రెస్) - బావి, స్వతంత్ర్య అభ్యర్థులు సీ.కిరణ్‌కుమార్‌కు బ్యాట్స్ మెన్, కోగిల వెంకటాచలం - కుండ, కోళ్ల విజయకుమార్ - ఉంగరం, చెంగయ్య - పనసకాయ, రమేష్ బాబు - గన్నా కిసాన్, కే.రాఘవయ్య - బ్యాట్, జే.రాజశేఖర్ - రూమ్ కూలర్, వెట్టి.వెంకటేష్ - క్యారం బోర్డు, వెంపళ్ల కృష్ణారావు - బుట్ట గుర్తులను కేటాయించారు.

వివాహిత అత్మహత్య



మౌనిష (ఫైల్‌ఫొటో)

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 29: మండలంలోని జీఎన్‌కండ్రిగ గ్రామానికి చెందిన వివాహిత మౌనిష(31) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుంటుంబ సభ్యులు కథనం మేరకు... ఈనెల 25న మురుగు కాలువ కారణంగా పెంచిలయ్యకు, ఆయన ఇంటి పక్కన నివాసం ఉన్న చిరంజీవి, వీరరాఘవులు, సుధీర్, సూజాత, చంద్రయ్య, రమేష్ మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో పెంచిలయ్య, ఆయన భార్య మౌనిషపై దాడి చేశారు. అవమానంగా భావించిన మౌనిష గురువారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినుత విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధి, జట్టిపాలెం, నెహ్రూవీధి ప్రాంతాల్లో సోమవారం ఇంటింటికి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాదను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం, ఏప్రిల్ 29: వరదయ్యపాళెం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఎన్.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న సుబ్రహ్మణ్యం రాజు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా శైలజను నియమించారు. ఆమె విధుల్లో చేరలేదు. దీంతో ఏవో అనసూయను ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా నియమించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కడప నుంచి వచ్చిన ఎంపీడీవో మహబూబ్‌బీ అనారోగ్య కారణాలతో మెడికల్ లీవ్‌పై వెళ్లారు. దీంతో సత్యవేడు ఎంపీడీవోను ఇన్‌ఛార్జిగా నియమించారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు ఉదయభారతి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 29: మండలంలో ఎన్నికల ఏర్పాట్లపై తహసీల్దారు ఉదయభారతి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ పార్టీల పోస్టర్లు ఉంటే తొలగించాలన్నారు. ఓటరు స్లిప్పులను ప్రతి ఓటరుకూ అందించాలని బీఎల్వోలను ఆదేశించారు. మే 1న రేషన్ బియ్యం అందించడంలో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

1న పింఛన్ల పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29: లబ్ధిదారులందరికీ మే 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేసేలా అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసిందని శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందువల్ల పింఛన్ల పంపిణీపై కలెక్టర్ కొత్త మార్గదర్శకాలు జారీ చేశారని తెలిపారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 8406 లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ఇందులో 6159 మందికి బ్యాంకు ద్వారా... 2247 మందికి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేస్తామన్నారు.

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం పురస్కరించుకొని ముక్కంటి ఆలయంలోని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేద మంత్రాలతో దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఏపీ: సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 29: దేశంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఏపీ అని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని పెన్నలపాడు, గురప్పనాయుడుకండ్రిగ, శేషమనాయుడుకండ్రిగ, పూడి, కోన్నలి, కనపర్తి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే వలంటీర్లను కొనసాగించడంతో పాటు జీతం రెట్టింపు చేయడం జరుగుతుందని, వైసీపీ నాయకుల బెదిరింపులకు బయపడి రాజీనామాలు చెయ్యవద్దని సూచించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, మట్టి, మాఫియా అక్రమాలు, దౌర్జన్యాలు తప్ప నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపి ఎన్డీఏ కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల అధ్యక్షుడు మురళీ నాయుడు, మునిరాజనాయుడు, బీజేపీ నాయకులు కండ్రిగ ఉమ, అమర్నాథ్, జనసేన నాయకులు కొట్టే సాయి, మాదవ్, చక్రదర్, తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: స్థానిక ఏఎస్ఆర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. తూకివాకం గ్రామంలో వైసీపీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి, పంచాయతీ వార్డు మెంబరు ధనమ్మ, గ్రామానికి చెందిన 70మంది వైసీపీని వీడి మబ్బు దేవనారాయణరెడ్డి నేతృత్వంలో టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మబ్బు దేవనారాయణరెడ్డి మాట్లాడుతూ తూకివాకం పంచాయతీని తాను దత్తతకు తీసుకుంటున్నానని ప్రకటించారు. పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాలను అభివృద్ధి చేయిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, భాస్కర్‌యాదవ్, జ్యోతినారాయణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మెహబూబ్‌బాషా, మోహనకృష్ణ, యేసయ్య, గోపి, కుమారమ్మ, బుజ్జినాయుడు, పాడి రాజేంద్ర, ఎంజీరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాదరావు

కలువాయి, తిరుపతి(ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 29: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలంలో టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సిలికా, ఇసుకను దోపిడీ చేసిందని విమర్శించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నా తనదే తప్పు అన్నట్లుగా వ్యవహరించారని తద్వారా వనరులన్నీ దోపిడీకి గురయ్యాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 యేళ్లల్లో జరగనంత అవినీతి ఐదేళ్లలో జరిగిందని ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని కోరారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీని గెలిపించాలని ఆయన ప్రజలకు విన్నవించారు. గతంలో తాను ఎంపీగా పనిచేసిన రోజుల్లో ఎంతో అభివృద్ధి చేశానని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్నో పెద్ద ఎత్తున నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. ఆయనతోపాటు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

సినీ నటుడు బాలకృష్ణతో భేటీ

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను వరప్రసాదరావు కుటుంబసభ్యులతో కలసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం తిరుపతికి వచ్చిన ఆయన ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉండగా కుటుంబసభ్యులు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమారుడు నవీన్‌గుప్తా, ఇతరలు భేటీ అయ్యారు. తమిళనాడు రిటైర్డ్ డీజీపీ శేఖర్ తదితరులు ఆయన్ను కలుసుకున్నవారిలో ఉన్నారు.



సినీ నటుడు బాలకృష్ణతో వెలగపల్లి వరప్రసాదరావు

హామీ పత్రం విడుదల

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29: తాను గెలిచిన తరువాత నియోజకవర్గంలో చేసే అభివృద్ధి పనులను సుధీర్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విడుదల చేశారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ఇంటి స్థలంతో పాటు పక్కా ఇళ్ల మంజూరు. ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్ పూర్తి, గుడిమల్లం, తొండమనాడు, శ్రీకాళహస్తి ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి, ఆలయంలో స్థానికులకు ఉచితంగా ప్రత్యేక దర్శనాలు, స్కిట్ కళాశాలను పునఃప్రారంభించి, జేఎన్‌టీయూకి అనుసంధానం, మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి, రేణిగుంట మండలం, శ్రీకాళహస్తి టౌన్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు, పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్, మండలానికో ఎంఎస్ఎంఈ ఏర్పాటు, మహిళల ఉపాధి, పంట ఉత్పత్తుల నిల్వకు గోడౌన్లు, ఎస్ఎస్ కెనాల్, బాలాజీ రిజర్వాయర్ పూర్తి చేసేందుకు చర్యలు, స్వర్ణముఖి నది ప్రక్షాళన చేసి, సుందరీకరణకు చర్యలు, కన్నలి కాలువ సమస్యను పరిష్కరించి, అండర్ గ్రౌండ్ డైనేజీ ఏర్పాటుకు ప్రయత్నం, ఆటోనగర్ ఏర్పాటుకు కృషి, యూనియన్లకు 20 సెంట్ల స్థలం కేటాయించనున్నట్లు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు.

కల్కి భూములను తక్షణం రైతులకు అప్పగించాలి

హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: కల్కి భూములను తక్షణం రైతులకు అప్పగించాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదయ్యపాళెం మండలం చెదులుపాకం గ్రామంలోని వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, బేబమ్మలకు చెందిన సీలింగు భూమి మూడెకరాల 74 సెంట్ల భూమిని 16 ఏళ్ల క్రితం కల్కి ఆక్రమించారని ఆరోపించారు. భూములోకి రైతులను అనుమతించకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. ఆక్రమించిన భూమిలో బిల్డింగులు కట్టామని, అందువల్ల ఆ భూమి తనకే అప్పగించాలని ఈ ఏడాది జనవరి పదో తేదీన కల్కి వేసిన పిటిషన్‌ని కోర్టు వేసిందని చెప్పారు. అయినా రైతులకు భూమిని అప్పగించడంలో అధికారులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో వివరణ ఇవ్వాలని కోరారు. అలాగే, ఏడాదికి రూ.4లక్షల చొప్పున రైతులకు కల్కి నుంచి పంట నష్ట పరిహారం ఇప్పించాలని సూచించారు. లేకుంటే దీనిపై తాము న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేస్తున్న దొంగ బాబాలను అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏఆర్ రెడ్డి, రైతులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఆదిమూలం



వేణుగోపాలపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 29: చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎన్డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం, నెలవాయి, వెస్ట్‌వరత్తూరు, కంచనపుత్తూరు, కుక్కంబాకం, కాంపాళెం పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్సుతో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని తెలిపారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు పడ్డారని, సంక్షేమం పేరుతో అభివృద్ధిని దూరం చేశారని చెప్పారు. అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సుముద్రాల సుధాకర్‌నాయుడు, కన్నయ్యానాయుడు, రమేష్‌యాదవ్, మధునాయుడు, శ్రీనివాసులు, వెంకటాచలం, సుందరయ్య, భూపయ్య, రాజేంద్ర, వెంకటేశ్వర్లు, గోపినాయుడు, శేషయ్య, మునిరాజ, బీజేపీ నేత మునిచంద్రారెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ఏర్పేడు, ఏప్రిల్ 29: ఏర్పేడు మండలం పెనగడం గ్రామం నుంచి బాబునాయుడు ఆధ్వర్యంలో 30మంది సోమవారం టీడీపీలో చేరారు. వారికి బొజ్జల రిషితారెడ్డి కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేణిగుంటలో ప్రచారం

రేణిగుంట, ఏప్రిల్ 29: రేణిగుంట పట్టణంలో టీడీపీ ప్రచారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం వినాయకనగర్‌లో టీడీపీ, జనసేన బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కూటమి నాయకులతో కలిసిప్రచారం నిర్వహించారు. కూటమి ప్రవేశపెట్టన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ సమస్యలను ప్రజలు తెలుపుతున్నారనిసైకిల్ గుర్తుపై ఓటు వేసి తన భర్తను గెలిపిస్తే రేణిగుంట మేజర్ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కేవీబీపురం, ఏప్రిల్ 29: మండలంలో రాయపేడు, రాజులకండ్రిగ, సదాశివపురం పంచాయతీల్లో సోమవారం ఎస్ఐ ఎస్‌కే నజరుద్దీన్ వాహన తనిఖీలు నిర్వహించారు. అలాగే రౌడీషీటర్లను బైండోవర్ చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మే3 నుంచి 21 వరకు..

శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల ఉత్సవం

తిరుమల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మే 3నుంచి 21వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం సందర్భంగా 19 రోజుల పాటు ఉభయం సమర్పణ జరుగుతుంది. శ్రీరామానుజులు జన్మించిన వైశాఖమాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మే 12న భాష్యకార్ల శాత్తుమొర నిర్వహిస్తారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఉజ్వల్‌కుమార్‌ఘోష్

పిచ్చాటూరు, ఏప్రిల్ 29: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తిరుపతి పార్లమెంట్ జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్ కుమార్ ఘోష్ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎస్‌వో సంజీవరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచాలి

వ్యయ పరిశీలకులు నీనా నిగం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ఠ నిఘా ఉంచాలని సాధారణ ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగం అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకులు శంకర్ ప్రసాద్ శర్మ, ఎస్.శ్రీనివాసకన్నా, మీను ఓలా తదితర అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం రాష్ట్రప్రత్యేక వ్యయ పరిశీలకులు సమీక్షించారు. నీనా నిగం మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో జిల్లా ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29: ఎస్వీయూ దూరవిద్య ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ ఫైనలియర్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మన బడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

పుత్తూరు వార్తలు

బ్యాంకు ఖాతాల్లోకి పింఛన్ నగదు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 29: సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. బ్యాంకు ఖాతాలేని లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఒకటవ తేదీ నుంచి 5వ తేదీ లోపు ఇంటి వద్దకు వచ్చి ఇస్తారని తెలిపారు.

మా మద్దతు టీడీపీకే

వడమాలపేట, ఏప్రిల్ 29: మండలంలోని పత్తిపుత్తూరు ఆదిఆంధ్రవాడవాసులు మాజీ సర్పంచు కాటయ్య, గోపీ, నాగరాజ ఆధ్వర్యంలో నగరి ఎమ్మెల్యే అభ్యర్థి భానుప్రకాష్‌ను తిరుపతిలోని ఆయన నివాసంలో సోమవారం కలిశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి టీడీపీని గెలిపిస్తామని మద్దతుగా ప్రకటించారు.

రోజాకు ఆస్తులు పెరిగాయి.. ప్రజలకు కష్టాలు మిగిలాయి



సమావేశంలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 29: ఐదేళ్లలో రోజాకు ఆస్తులు పెరిగితే... నియోజకవర్గ ప్రజలకు మాత్రం కష్టాలు మిగిలాయని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని తడుకు పంచాయతీ తిమ్మరాజుకండ్రిగ, శిరుగురాజుపాళెం, నేసనూరు, గట్టు, వడ్డిండ్లు, రామసముద్రం, తిరుమలకుప్పం, కేబీఆర్ పురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు మంత్రి రోజా ఆస్తులు ఎంత, ఇప్పుడు ఆస్తులు ఎంతని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని అవినీతి జరిగిందని దుయ్యబట్టారు. ఏపీఐఐసీ చైర్మన్‌గా రెండేళ్ల పదవి వెలగబెట్టిన రోజా నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చే ఒక్క పరిశ్రమను కూడా సాధించలేదుగాని, కుటుంబసభ్యులకు ఒక్కొక్క మండలాన్ని కేటాయించి దోచుకోమనే ఉద్యోగం ఇచ్చిందని ఆరోపించారు. మళ్లీ వైసీపీకి ఓట్లేస్తే మీ ఆస్తులు మీవి కావని హెచ్చరించారు. తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటూ సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. అరాచక పాలనకు ముగింపు పలికేందుకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్, తడుకు సర్పంచ్ బొబ్బిలియాదవ్, మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రాజు, కరుణాయాదవ్, వెంకటేష్, బాబి, సతీష్‌నాయుడు, జనసేన సురేష్ పాల్గొన్నారు.